నేడు 'కొన్ని చీకట్లు..ఓ వెలుతురు'

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కోయిల చెట్టు కథా సంపుటి రచయిత డాక్టర్ ప్రగతి రచించిన రెండవ కథల సంపుటి 'కొన్ని చీకట్లు..ఓ వెలుతురు' పుస్తకాన్ని ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఆవిష్కరించనున్నట్లు రచయిత డాక్టర్ ప్రగతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ కవి సోమచర్ల రాజారావు అధ్యక్షతన నిర్వహిస్తున్న పుస్తక పరిచయ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగివేమన విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్యులు ఎంఎం.వినోదిని హాజరు కానున్నట్లు తెలిపారు. వీరితోపాటు టి.వెంకట్‌నారాయణ, అంకే శ్రీనివాస్, పల్లవి హాజరవుతారన్నారు. కావున కవులు, కళాకారులు, సాహితీవేత్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల ఆందోళనకు అడ్డంకులు..!

పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

- ◆ కలెక్టరేట్‌కు రాకుండా అడ్డుకున్న పోలీసులు
- ◆ నిర్బంధాన్ని ఎదిరించి కలెక్టరేట్ వద్ద ధర్నా
- ◆ సమ్మెకాలపు హామీలు అమలుచేయాలని డిమాండ్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమ్మె కాలపు హామీల అమలు, సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కదం తొక్కారు. ధర్నాకు ముందస్తుగా పిలుపునివ్వడంతో అంగన్‌వాడీలు పుట్టపర్తిలోకి రాకుండా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆటోల్లో వస్తున్న అడ్డుకుని కిందకు దించేశారు. పోలీసులు అడ్డుకున్నా వివిధ మార్గాల ద్వారా మినీ అంగన్వాడీలు పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్నారు. మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తించాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఇంతియాజ్, జిఎల్.నరసింహులు, ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు 42 రోజుల రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై అనేక హామీలు ఇచ్చిందన్నారు. సమ్మె ముగిసి ఎనిమిది నెలలు గడుస్తున్నా హామీల ఒప్పందం మేరకు ఏ ఒక్క డిమాండ్‌నూ ఇప్పటికీ పరిష్కరించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని సాకుచూపి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోవడం సరికాదన్నారు. మినీ సెంటర్ల వర్కర్లపై పని భారం మోపుతూ బానిసలుకంటే దారుణంగా పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలను నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు సంబంధంలేని యాప్ పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. నెలల తరబడి సెంటర్ అద్దెలు బకాయి ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ ఆదేశాలు ఇవ్వాలన్నారు. 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. ఉద్యోగోన్నతులు, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె ఒప్పందం అమలుకు దశలవారి పోరాటాలకు అంగన్వాడీలు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. అనంతరం డిఆర్ఒ విజయ సారధికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సాంబశివ, లక్ష్మీనారాయణ, పైపల్లి గంగాధర్, బాబావలి, అంగన్వాడీ జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

డిఆర్‌ఒ విజయ సారధికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలను సీజ్ చేయాలి

- విద్యార్థి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి
- ఆసుపత్రి ఆవరణలో మృతదేహంతో ఆందోళన
- బాధితులకు మద్దతు పలికిన విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

తమ కుమారుడి మృతికి కారణమైన సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలను సీజ్ చేసి, దాడికి పాల్పడిన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని మృతుని తల్లిదండ్రులు, బంధువులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక ఆసుపత్రి ఆవరణంలో విద్యార్థి మృతదేహంతో ఆందోళన చేశారు. వారికి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ తదితరులు మద్దతు పలికారు. హిందూపురం పట్టణానికి చెందిన ప్రేమ్ సాయి పుట్టపర్తిలోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 13న అదే తరగతిలో ఉన్న కొంత మంది విద్యార్థులు ప్రేమ్ సాయిపై దాడి చేసి రక్త స్రావం అయ్యే విధంగా కొట్టారు. విషయం తెలిసిన వెంటనే విద్యార్థి తల్లిదండ్రులు అక్కడికి వెళ్లిప్రేమ్ సాయిని హిందూపురం తీసుకొచ్చి వైద్య సేవలను అందిస్తున్నారు. అయితే శుక్రవారం సాయంత్రం ప్రేమ్ సాయి మృతి చెందాడు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు రెండవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సిఐ అబ్దుల్ కరీం మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో బాధితులు తమకు జరిగిన అన్యాయంపై అసుపత్రి ఎదుట శనివారం ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, మైనార్టీ నాయకులు ఇందాద్, ఎం ఎస్ ఎఫ్ నాయకులు రవి కుమార్ బాధితులకు మద్దతు పలికి అసుపత్రి ఆవరణంలో మృతదేహం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కళాశాలలో విద్యార్థులు గొడవ పడి తోటి విద్యార్థి చావుకు కారణమవుతున్నప్పటికి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. రక్త స్రావంతో బాధపడుతున్న విద్యార్థి ప్రేమ్ సాయిని కనీసం అసుపత్రిలో చేర్పించి, ప్రథమ చికిత్సను సైతం ఇప్పించ లేదన్నారు. విద్యార్థిని అక్కడి నుంచి తీసుకొచ్చిన అనంతరం గొవడకు కారణమైన విద్యార్థులపై చర్యలు సైతం తీసుకోలేదన్నారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థి చావుకు కారణమైన కళాశాలను వెంటనే సీజ్ చేసి, కళాశాల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రేమ్ సాయిపై దాడి చేసి, చావుకు కారణమైన విద్యార్థులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. తమ కుమారుడి మృతికి కారణమైన వారిని అరెస్టు చేసే వరకు మృత దేహాన్ని ఇక్కడి నుంచి తీసుకెళ్లమని మృతుని తల్లిదండ్రులు ఆసుపత్రి ఎదుటే బైటాయించారు. చివరకు టూటౌన్ సిఐ అబ్దుల్ కరీం హామీతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హుస్సేన్, నందీష్, శశి, సాయిబాబా, తరుణ్, అరవింద్, విగ్నేష్, ఎంఎస్ఎఫ్ నాయకులు ఆదర్శ్, సునీల్, మూర్తితో పాటు మృతుని బంధువులు పాల్గొన్నారు.

మృతదేహంతో ఆందోళన చేస్తున్న విద్యార్థి బంధువులు, విద్యార్థిసంఘాల నాయకులు, టిడిపి నాయకులు

విద్యార్థి మృతిపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి : సిపిఎం

కళాశాలలోకి నాయకులు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని బీడుపల్లి సంస్కృతి కళాశాలలో బీటెక్ విద్యార్థి ప్రేమ్ సాయి మృతిపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి నిజా నిజాలను వెలికి తీయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం సంస్కృతి కళాశాలలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ముఖద్వారం వద్దనే పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఇఎస్ వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న, వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థి మృతి పట్ల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంభించిందని విమర్శించారు. జరిగిన సంఘటనపై వెంటనే ప్రాథమిక విచారణ జరిపి విద్యార్థికి చికిత్సలు అందించి ఉంటే ప్రాణాపాయం తప్పేదని అన్నారు. కరువు ప్రాంతమైన సత్యసాయి జిల్లాలో విద్యార్థులను చదివించడానికి వారి తల్లిదండ్రుల కష్టం ఎంతో ఉంటుందని అన్నారు. కూలి పనులు చేసుకుంటూ లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లిస్తూ చదివిస్తుంటే విద్యార్థులకు కనీస భద్రత కల్పించకపోవడం దారుణమన్నారు.కళాశాల యాజమాన్యానికి ఫీజులు మాత్రమే ముఖ్యమని విద్యార్థుల భద్రత, వారి బాగోగులు పట్టవని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతికి యాజమాన్యం కూడా బాధ్యత వహించాలన్నారు. సంస్కృతి కళాశాలలో శనివారం విచారణ చేపట్టిన అధికారులు ఎలాంటి సమాచారం అందించలేదని, విచారణలో తేలిన నిజా నిజాలు తెలియ రాలేదని అన్నారు. విచారణ అనంతరం విద్యార్థి కుటుంబానికి రెండు రోజులలో సరైన సమాచారం అందకపోతే ప్రజా సంఘాలు, ఎస్ ఎఫ్ ఐద్వారా సిబిఐ ఎంక్వయిరీ జరిగే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు.

శ్రీ బాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

జలసాధన సమితి నాయకులు

నిరసన వ్యక్తం చేస్తున్న జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేసి రాయలసీమను సస్యశ్యామలం చేయాలని జలసాధన సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఇందిరాపార్క్‌లో కల్లూరు సుబ్బారావు విగ్రహం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జల సాధన సమితి ప్రతినిధులు మాట్లాడుతూ రాయలసీమ హక్కుల కోసం ఆనాడు జరిగిన శ్రీబాగ్ ఒడంబడికలో హిందూపురం వాసి కల్లూరు సుబ్బారావు సంతకం చేసిన వారిలో ఒకరని అన్నారుజ ఆనాడు జరిగిన ఒడంబడికలో కోస్తాతో సమానంగా తుంగభద్ర, కృష్ణా జలాలను రాయలసీమకు అందిస్తామని, హైకోర్టు రాజధాని ఎక్కడ కావాలంటే అక్కడ రాయలసీమలో నెల కోల్పాలని, కోస్తా తో సమానంగా శాసన సభ్యులను రాయలసీమలో నియమించాలని ఒప్పందం జరిగిందన్నారు. ఈ మూడు ఒప్పందాలలో ఏ ఒప్పందం కూడా ఇంతవరకు అమలు జరగలేదన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కర్నూలును న్యాయ రాజధానిగా ఏర్పాటు చేసి కర్నూలులో మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరిగి లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్‌ను రాజధాని అమరావతికి మార్పునకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, హైకోర్టును, మానవ హక్కుల కమిషన్, లోకాయుక్తను కర్నూలు లోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హంద్రీనీవా ప్రధాన కాలువను 6300 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతూ అందుకు రూ.6,182 కోట్ల బడ్జెట్‌కు పరిపాలన ఆమోదం తెలిపారన్నారు. అయితే ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 3850 క్యూసెక్కులకు మాత్రమే కాలువ వెడల్పుకు చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారని, హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 10,000 క్యూసెక్కులకు పెంచాలని, అలాగే మడకశిర బ్రాంచ్ కెనాల్ సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ప్రధాన కాలువ నుండి పిల్ల కాలువల ద్వారా మూడు లక్షల 45 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వాలని జల సమితి ప్రతినిధులు కోరారు. సాగునీటి బడ్జెట్ లో రాయలసీమ ప్రాంతానికి కేవలం 15 -20 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని, రాయలసీమలోని 46శాతం భూభాగం ఉందని, సాగునీటి బడ్జెట్ లో 46శాతం రాయలసీమ ప్రాంతానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా హంద్రీనీవా కాలువ పారుతున్నప్పటికీ మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా హిందూపురం ప్రాంతానికి చెరువులకు నీరు అందించలేదని, వెంటనే కాలువ మరమ్మతులు చేసి హిందూపురం , మడకశిర పెనుకొండ ప్రాంతాల చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షులు, వెంకటరామిరెడ్డి, ఒపిడిఆర్ శ్రీనివాసులు, రచయిత సడ్లపల్లె చిదంబరెడ్డి, జలసాధన సమితి నాయకులు అమానుల్లా, జమీల్, చైతన్య తిప్పేస్వామి, కార్మిక నాయకుడు రవి, దాసరి హరి ,పర్యావరణ వేత్త భాస్కర్ రెడ్డి, పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి లోకేష్, విశ్రాంత ప్రిన్సిపాల్ ఓబుల్ రెడ్డి, గంగిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు ఓబులేష్, చైతన్య సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం మరమ్మతు .. శిశువు మృతి

టైరు పంచరు కావటంతో రోడ్డు పక్కన ఆగిన 108 వాహనం

ప్రజాశక్తి-హిందూపురం

108 అంబులెన్స్ పంచర్ కారణంగా అందులోని శిశువు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. పెనుకొండకు చెందిన నవీదా పురుటినొప్పులతో శనివారం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి ప్రసవం నిమిత్తం వచ్చింది. సాధారణ కాన్పుతోనే పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే శిశువును పరీక్షించిన వైద్యులు శిశువు శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతుండడంతో ప్రథమ చికిత్సను అందించి, అనంతపురానికి రెఫర్ చేశారు. నియోనాటల్ 108 అంబులెన్స్ ద్వారా హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అనంతపురానికి తీసుకెళ్తుండగా, ఎన్ఎస్ గేట్ సమీపంలో అంబులెన్స్ టైర్ పంచర్ అయింది. అయితే అంబులెన్సులో మరో టైరు లేకపోవడంతో.. ఇతర అంబులెన్స్ రాగా అందులో ఉన్న స్టెప్నిని తీసుకుని. అంబులెన్సుకు మార్చుకుని వెళ్లారు. సుమారు 45 నిమిషాలకు పైగా అంబులెన్స్ ఆలస్యంగా అనంతపురానికి చేరుకుంది. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యుడు శిశువు మృతి చెందినట్లు తెలిపారు. అంబులెన్స్ ఆలస్యంగా చేరడంతోనే శిశువు మృతి చెందినట్లు బాధితులు వాపోయారు. శిశువు మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.

బడ్జెట్‌లో జరిగిన మేలెంత ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఈ వారంలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందన్నది సర్వత్రా సాగుతున్న చర్చ. వర్షాభావ ప్రాంతమైన అనంతపురం జిల్లాకు అత్యంత ప్రధానమైనవి సాగు,తాగునీరు. ఈ రెండింటిని అందివ్వాలని జిల్లావాసులు ఎప్పుడూ అడుగుతూనే ఉంటారు. మానవ జీవనానికి కనీసమైన ఈ రెండింటిని అందిస్తే ఈ ప్రాంతాభివృద్ధి కొంత వరకైనా మెరుగుపడుతుందన్నది జిల్లావాసుల ఆకాంక్ష. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి జూన్‌లో వస్తే ఇప్పుడు తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇది వచ్చే మార్చి వరకు ఉండనుంది. ఈ తక్కువ కాలానికి ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే నామ మాత్రమేనని ప్రతిపక్షాలు పెదవి విరుస్తుండగా, బాగా కేటాయింపులు జరిగాయని అధికారపార్టీ భావిస్తోంది. అయితే ఇందులో కేటాయింపుల వరకు చూస్తే కొంత వరకు నిధులను హంద్రీనీవాకు కేటాయించారు. గతం కంటే కొంత మెరుగుదల కనిపిస్తోంది. రూ.1870 కోట్ల వరకు నిధులు కేటాయించారు. ఇది ప్రధాన కాలువ ఆధునీకరణకని చెబుతున్నారు. ఇందులోనూ ఇంకా పేరూరు ఎత్తిపోతలు, భైరవానితిప్ప ఎత్తిపోతల పథకాలున్నాయి. ఇవి కాకుండా సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి నియోజకవర్గంలోనూ చెరువులకు నీటిని అందించే పనులూ ఉన్నాయి. ఇవన్నీ కలిపి దాదాపు రెండు వేల కోట్ల రూపాయలకుపైగా పనులు ఉన్నాయి. ఇందులో వేటికి ఇప్పుడు ప్రాధాన్యతనిస్తారన్నది చూడాల్సి ఉంది. ఇక ప్రధానమైన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు మాత్రం నిధుల కేటాయింపులు చేయలేదు. ప్రధాన కాలువ ఆధునీకరణకు ఈ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని అందరూ ఆశించారు. కాని నిర్వహణకు కేటాయించకపోవడంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ దుస్థితి ఇప్పట్లో మారేలా కనిపించడం లేదు. ఇక తక్కిన వాటికి కూడా జిల్లాకు ప్రత్యేకమైన కేటాయింపులేవీ కనిపించలేదు. దీంతో ఎప్పటిలాగానే సాధాసీదా బడ్జెట్‌గానే ఉందన్న విమర్శలు ప్రతిపక్షాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇక ఈ వారంలో నామినేటెడ్ పదవుల భర్తీని చేపట్టింది. రెండో దఫా చేపట్టిన నామినేటెడ్ పోస్టుల్లో జిల్లాకు ఒక్క పదవి మాత్రమే వచ్చింది. అది కూడా కూటమిలోనున్న జనసేన పార్టీకి చెందిన టిసి.వరుణ్‌ను అహుడా ఛైర్మన్‌గా నియమించారు. ఆర్టీసి రీజనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజుకు నియమించారు. ఇక మిగిలిన నేతలెవరికీ ఎటువంటి పదవులు దక్కకపోవడంపై తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. ఎన్నికల సమయంలో టిక్కెట్లు ఇవ్వని సీనియర్ నాయకులకు కూడా ఎటువంటి పదవినీ ఇవ్వలేదు. ఇది నేతల్లో అంతృప్తిని రాజేస్తోంది. ఇక ఈ వారంలో చోటు చేసుకున్న మరో అంశం వర్షాలు. ఎప్పుడూలేని విధంగా అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా నవంబరులో వర్షాలు పడుతున్నాయి. దీని మూలంగా నూర్పిడి దశకు వచ్చిన వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతింటున్నాయి. ఇతర పంటలపైనా ఈ ప్రభావం ఉండనుందని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా పత్తి, కందిపంటలకు చీడపీడలు వ్యాపించి దిగుబడిపై ప్రభావం చూపనుంది. ఒకవైపు సీజన్ ప్రారంభం ఆగస్టులో వర్షాభావం తరువాత అక్టోబరులో అత్యధిక వర్షపాతం, ఇప్పుడు తుఫాను కలిపి అన్ని విధాలుగా రైతులకు నష్టం చేకూర్చింది.

అన్నమయ్య జిల్లాలో

క్షుద్రపూజల్లో కదిరి వైసిపి నాయకుడు

క్షుద్రపూజలను అడ్డుకున్న స్థానికులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

- మదనపల్లికి చెందిన ఓ డాక్టర్‌తో కలిసి పాల్గొన్న నేత
- గుప్తనిధుల కోసమేనన్న అనుమానాలు
- పోలీసుల అదుపులో నిందితులు..?

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరికి చెందిన ఓ వైసిపి నాయకుడు అన్నమయ్య జిల్లా బి. కొత్తకోట మండలంలోని ఓ పురాతన దేవాలయంలో శనివారం తెల్లవారుజామున క్షుద్రపూజలు చేస్తూ పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. మదనపల్లికి చెందిన ఓ డాక్టర్‌తో కలిసి గుప్తనిధుల తవ్వకాల్లో భాగంగా క్షుద్రపూజలు చేస్తూ పట్టుబడినట్లు తెలిసింది. ఈఘటనకు సంబంధించి విశ్వసనీయంగా తెలిసిన వివరాలు... కదిరికి చెందిన వైసిపి నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డి, మదనపల్లికి చెందిన ఓ డాక్టర్ ఎ.వి.సుబ్బారెడ్డి కలసి అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఓ పురాతన దేవాలయం వద్ద శనివారం తెల్లవారుజామున గుప్త నిధులకోసం క్షుద్రపూజలు నిర్వహిస్తున్నారు. అది గమనించిన చుట్టుపక్కల గ్రామాల వారు వారిని ఘటనాస్థలంలోనే నిలదీశారు. అక్కడ జరుగుతున్న తతంగాన్ని పోలీసులకు సమాచారమందించారు. దీంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్న సమాచారం. ఇదిలా ఉండగా కదిరికి చెందిన వైసిపి నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డిపై స్థానికంగా పలు ఆరోపణలు ఉన్నాయి. ప్రజాసేవకుడిగా చెలామణి అవుతూ దేవుడి మాన్యం భూములను దోచుకోవటానికి కుట్ర పన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో కదిరికి చెందిన ఓ వ్యాపారి ఆస్తిని కూడా కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-సోమందేపల్లి

గిరిజనులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల అధికారులు తెలిపారు. భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా శనివారం మండలంలోని నాగినేనిచెరువు తండాలో సర్పంచ్ అంజి నాయక్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. అన్ని శాఖల మండల అధికారులు పాల్గొని గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సేవలను వివరించారు. గ్రామ సభలో డిప్యూటీ శివనారాయణరెడ్డి, డిఎల్‌డిఒ నరేష్‌కృష్ణ, ఎంపిడిఒ మమతాదేవి, ఈఓఆర్‌డి లక్ష్మీనరసమ్మ, విద్యుత్ ఏఈ పరమేశ్వర్‌రెడ్డి, ఎంఇఒ ఆంజనేయులునాయక్, హౌసింగ్ ఏఈ జనేయులు, పంచాయతీ రాజ్ ఏఈ రవికుమార్, వైద్యాధికారి డాక్టర్ హరికుమార్, ఏవో కవితారాణి, ఇరిగేషన్ ఏఈ సిఎస్. వేణు, పంచాయతీ కార్యదర్శులు రమేష్‌బాబు, కె.శాంతి, ఆర్.నిర్మల, యోగీశ్వర్, ఉప సర్పంచి బి.మంజుల, వార్డు మెంబర్ ఎస్.లక్ష్మీదేవి, బిజెపి జిల్లా నాయకులు పి.హరినాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన తండాలో గ్రామసభలో పాల్గొన్న అధికారులు

బాలికలను వేధింపుల నుంచి రక్షిస్తాం : డీఎస్పీ

ప్రజాశక్తి-పెనుకొండ

బాలికలను వేధింపుల నుంచి రక్షించడమే లక్ష్యమని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. బాల హక్కుల వారోత్సవాలు, దత్తత మాసం పురస్కరించుకొని శనివారం బాలల పరిరక్షణ విభాగం, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల సంక్షేమ హాస్టల్‌లో సిడిపిఒ శాంతలక్ష్మి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ బాలికలు బాల్య వివాహాలను ఎలా ఎదుర్కోవాలి, దుష్ట శక్తులు, అల్లరి మూకల నుంచి ఎలా రక్షించు కోవాలో అవగాహన కల్పించారు. సిడిపిఒ మాట్లాడుతూ ప్రతి బాలిక పౌష్టికాహారం తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం ఏ ఒక్కరూ బాల్య వివాహానికి గురి కాకూడదని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం నుంచి ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, తిరుమల, ఆనంద్, సిఐఎఫ్ కోఆర్డినేటర్ కొండప్ప, సమతా సంస్థ సభ్యులు మహేష్, చిన్నారులు పాల్గొన్నారు.

గిరిజన తండాలో గ్రామసభలో పాల్గొన్న అధికారులు

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపిడిఒ నరేష్‌కృష్ణ కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ భవనంలో శనివారం ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే వారి బ్యాంకు ఖాతాలకు ఎన్‌పిసిఐ తప్పక చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో చెరువు కట్టల అభివృద్ధికి చొరవ చూపాలని, చెరువు కట్టలపై పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను మార్చి లోపు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ తెలిపారు. పూర్తయిన వాటికి బిల్లులను ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. మార్చి లోపు గృహ నిర్మాణాలు పూర్తికాకపోతే నిధులు కేంద్రానికి తిరిగి వెళ్లిపోతాయని వివరించారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖల పరిధిలోని పనులను వివరించారు. కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రభుత్వం బిసి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తుందని ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి నిర్మల జ్యోతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. రిజర్వేషన్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. వివరాలకు 9392141545 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-కదిరి టౌన్

'మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అని జనసేన పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యనిర్వహణ కమిటీ సభ్యులు, పట్టణ ఉపాధ్యక్షులు కటాల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. లక్ష్మణ్ ఆధ్వర్యంలో శనివారం మాధవ గురుకులంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. లక్ష్మణ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు, వాతావరణ కాలుష్యంతో పర్యావరణం కలుషితమైందన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లిరోజున మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజేంద్ర, అరవింద్, చిన్న, గణేష్‌నాయక్, అజహర్, సోమశేఖర్, సాయి పాల్గొన్నారు.

విద్యార్థుల వెరిఫికేషన్‌ను వేగవంతం చేయండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

అపార్ కార్డు రూపకల్పనకు విద్యార్థుల ధ్రువీకరణపత్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ నరసింహనాయుడు ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం బత్తలపల్లి విద్యాశాఖ అధికారి, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ అపార్ కార్డు కోసం విద్యార్థుల వివరాలను సమగ్రంగా అప్‌లోడ్ చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్‌పై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంఇఒ కార్యాలయం ఏవో శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి తరలి వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను శనివారం పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఉదయం నుంచి పుట్టపర్తికి వివిధ మండలాల నుంచి తరలివస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను మామిళ్లకుంట క్రాస్ సమీపంలో అడ్డుకొని వారిని వెనక్కు పంపారు. అలాగే జగరాజుపల్లి ప్రధాన రహదారిలో ఆటోలు, బస్సుల్లో వస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను గుర్తించి వారిని వాహనాల నుంచి కిందకు దించి వెనక్కి పంపారు. పోలీసులు చర్యల పట్ల అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు మండిపడ్డారు. మరికొందరు అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్లకు తరలించి ఆ తర్వాత వదిలివేశారు.

కోటి రాముడుకి నివాళి

బత్తలపల్లి : మాజీ సర్పంచి కోటి రాముడు బడుగు, బలహీన వర్గాల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పలువురు కొనియాడారు. బత్తలపల్లిలోని కోటి ఘాట్‌లో శనివారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 12వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కోటి రాముడు భార్య యల్లమ్మ కుటుంబ సభ్యులు సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. కోటి సూర్యప్రకాష్ బాబు మాట్లాడుతూ తమ కుటుంబం ఎప్పుడూ పేదలకు అండగా ఉంటుందన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కోటి సుధ, ఉప సర్పంచి కోటి గోపీనాథ్, కోటి రేణుక, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-బత్తలపల్లి

వాహనం నడిపేవారు వాహనాలకు సంబంధించిన రికార్డులతో పాటు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ తెలిపారు. సిఐ ఆధ్వర్యంలో శనివారం సాయంకాలం బత్తలపల్లి సమీపంలోని నూతన బైపాస్‌లో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. సిఐ మాట్లాడుతూ రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అన్నారు. రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు. తనిఖీలు చేసినప్పుడు వాహనాల రికార్డులు లేకపోతే జరిమానా విధిస్తామన్నారు. అలాగే వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మన్న, కానిస్టేబుల్ రామాంజనేయులు, హోంగార్డు చెన్నప్పనాయుడు, తదితరులు ఉన్నారు.

సత్యసాయి జయంతి వేడుకల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో జరుగుతున్న సత్యసాయిబాబా జయంతి వేడుకల ఏర్పాట్లను శనివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పరిశీలించారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్త రోడ్, వై జంక్షన్, పెద్ద కమ్మవారిపల్లి చింత తోపు వద్ద వాహనాల పార్కింగ్ ప్రదేశం, పడమర గేటు, కర్నాటక నాగేపల్లి వద్ద వాహనాల పార్కింగ్ స్థలాన్ని, ప్రత్యేక మరుగుదొడ్ల ఏర్పాటు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. చిత్రావతి బ్రిడ్జి వద్ద వాహనాల పార్కింగ్ కోసం ఎలాంటి దుకాణాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఫుట్‌పాత్‌తో పాటు చిత్రావతి నది పరివాహక ప్రాంతాన్ని, మున్సిపాలిటీ పరిధిలో రోడ్లను అందంగా ఉంచాలని కమిషనర్ ప్రహ్లాద, వారి సిబ్బందికి సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సత్యసాయి ట్రస్టు సహకారంతో ప్రభుత్వ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పల్లె వెంట మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, ఇంజినీర్ నరసింహమూర్తి, మున్సిపల్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సత్యసాయి జయంతి వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్లె

గోరంట్ల వైసిపిలో భగ్గుమన్న విభేదాలు

శంకరనారాయణపై ఉషశ్రీ వర్గం ఫైర్

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

గోరంట్ల వైసిపిలో విభేదాలు రోడ్డుకెక్కాయి. మాజీ మంత్రి శంకరనారాయణ మండలంలో వైసిపిలో విభేదాలు లేపవద్దని, నియోజకవర్గంలో తిరగాలంటే నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉషశ్రీచరణ్‌ను కలుపుకొని వెళ్లాలని ఉషశ్రీ వర్గం నాయకులు ఘాటుగా హెచ్చరించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, మేజర్ పంచాయతీ ఉప సర్పంచి రాజారెడ్డి, గంపల రమణారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత గురువారం వైసిపి కార్యకర్తలపై కేసు నమోదు కాగా మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ ఇన్‌ఛార్జిని ఏమాత్రం సంప్రదించకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014, 2019లో మీకు అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి మీ గెలుపు కోసం కృషి చేశారన్నారు. 2024లో ఉషశ్రీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు కేటాయించారన్నారు. కావున పెనుకొండ నియోజకవర్గంలో ఏ పని చేసినా అందరినీ కలుపుకొని వెళ్లాలని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. కార్యకర్తలను గ్రూపులుగా చేసి తగాదాలు పెట్టడం మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు గంగిరెడ్డి, ఓబుళరెడ్డి, సర్పంచి ఆంజనేయులు, నజరుల్లా, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, భక్తర్, వెంకటశివారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

దాడి చేసిన శాండిల్స్ పరిశ్రమ సూపర్‌వైజర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-గోరంట్ల

శాండిల్స్ పరిశ్రమలో మహిళా సెక్యూరిటీగార్డ్‌పై దాడి చేసిన సూపర్వైజర్‌పై చర్యలు తీసుకోవా లని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బూదిలి గ్రామ సమీపం లో ఉన్న శాండిల్స్ పరిశ్రమలో శనివారం మహిళా సెక్యూరిటీగార్డ్ రాజేశ్వరిపై సూపర్‌వైజర్ త్రివేదిలాల్ దాడి చేశాడు. దీంతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వర్ణలత, కొండా వెంకటేష్ బాధితురాలికి అండగా నిలిచారు. వారు మాట్లాడుతూ సూపర్‌వైజర్ కొంతకాలంగా వేధిస్తున్నాడని బాధితురాలు సిఐటియు నాయకుల దృష్టికి తీసుకొచ్చిందన్నారు. ఇదే సందర్భంలో శనివారం విధుల్లో ఉన్న తనపై సూపర్‌వైజర్ దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయని బాధితురాలు వాపోయింది. ఈ విషయంపై బాధితురాలితో కలిసి సిఐటియు నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు శాండిల్స్ పరిశ్రమ వద్దకు చేరుకొని జరిగిన విషయాన్ని హెచ్‌ఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సూపర్‌వైజర్‌ను ఉద్యోగం నుంచి తొలగించి మహిళలకు రక్షణ కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సూపర్‌వైజర్‌పై కేసు నమోదు చేసినట్లు సిఐ శేఖర్ తెలిపారు.

సూపర్‌వైజర్‌పై హెచ్‌ఆర్‌కు ఫిర్యాదు చేస్తున్న సిఐటియు నాయకులు

పాత్రికేయుడిపై కేసు నమోదుపై విచారిస్తాం : డీఎస్పీ

ప్రజాశక్తి-కదిరిటౌన్

పాత్రికేయుడిపై ఎస్ఐ కేసు నమోదు చేయడాన్ని శనివారం పట్టణంలోని పాత్రికేయులు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఎస్పీ ఆ కేసుపై సంబంధిత ఎస్ఐని అడిగి తెలుసుకొని న్యాయం చేస్తామని తెలిపారు. కాగా పాత్రికేయుడిని దూర్భషలాడిన హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని శనివారం నల్లచెరువు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయాన్ని వారు డీఎస్పీకి వివరించారు. డీఎస్పీని కలిసిన వారిలో ఎపియుడబ్ల్యుజె డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాధిక్‌వలి, నాయకులు అమృతరాజ్, ఫారుక్, ఎలక్ట్రానిక్ మీడియా సంయుక్త కార్యదర్శి జాని, హరి, అమరనాథ్, నాగేష్ పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై పాత్రికేయుల ఫిర్యాదు

ఓబుళదేవరచెరువు : పాత్రికేయునిపై దురుసుగా ప్రవర్తించిన బిసి హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఓడి.చెరువు పాత్రికేయులు తహశీల్దార్ అనంతాచారి, ఎంపిడిఒ రాబర్ట్‌విల్సన్‌కు వినతి పత్రాలు సమర్పించారు. ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యవర్గ సభ్యుడు వసంతం భుజంగరావు, సీనియర్ పాత్రికేయులు షాజహాన్, లక్ష్మన్న మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై వార్తలు రాసిన పాత్రికేయుని పట్ల వార్డెన్ దురుసుగా ప్రవర్తించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ గోపీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రంగప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, ఆదిమూర్తి, మోమిన్, ఫయాజ్, విశ్వనాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నరసింహులు, బాలరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని నాగినేనిచెరువు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత డి.వి.ఆంజనేయులు రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. దీంతో స్థానిక టిడిపి నాయకులు, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి.హరి శనివారం ఆయన ఇంటికి వెళ్లి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. హరి మాట్లాడుతూ టిడిపిలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందన్నారు. ఆంజనేయులు మొదటి నుంచి టిడిపిలో ఉంటూ పార్టీ కోసం నిరంతరం పని చేసి ప్రత్యేక స్థానం తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎల్‌ఐసి మహమ్మద్, అన్సర్‌బాషా, రంగన గోపాల్, గట్టా మహేంద్ర, మనోహర్,తదితరులు పాల్గొన్నారు.



డి.వి.ఆంజనేయులును సన్మానించిన హరి, తదితరులు

హాస్టల్ మెస్ బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాల్లోని విద్యార్థులకు పెండింగ్లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను వెంటనే చెల్లించాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నాగేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6 నెలలుగా మెస్ ఛార్జీలు ఇవ్వకపోవడంతో వార్డెన్లకు హాస్టళ్ల నిర్వహణ భారమైందన్నారు. అలాగే విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, పెట్టెలు వెంటనే అందజేయాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కార్తీక్, విష్ణువర్ధన్, మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం అధిక ధరకు విక్రయిస్తే చర్యలు : ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి-పెనుకొండ

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. ఆయన శనివారం పెనుకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కర్నాటక మద్యం, బెల్ట్ షాపుల నియంత్రణ, తదితర అంశాలపై సిబ్బందికి సూచనలిచ్చారు. తనిఖీల్లో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, పెనుకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సృజనబాబు, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఆర్టీసీ డిఎమ్‌కు వినతి

మడకశిర : మడకశిర ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కార్మికులు డిఎం రామసుబ్బయ్యకు వినతి పత్రం సమర్పించారు. వారు డిఎం దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లి వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా గ్యారేజీ సిబ్బంది సూపర్‌వైజర్లపై పని ఒత్తిడి, వేధింపులు మానుకోవాలన్నారు. నాణ్యతమైన స్పేర్స్, టూల్స్ సకాంలో తెప్పించాలన్నారు. అక్రమంగా ఛార్జ్‌షీట్, పనిష్మెంట్లు ఇవ్వటం మానుకోవాలన్నారు.

ప్రెస్‌క్లబ్ సాధనకు నూతన కమిటీ ఎంపిక

పుట్టపర్తి అర్బన్ : స్థానిక సాయి ఆరాయంలో శనివారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు సమావేశమై ప్రెస్‌క్లబ్ సాధనకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిర్వహించారు. ప్రెస్ క్లబ్ సాధన కమిటీ గౌరవాధ్యక్షులుగా వైవి.రంగారెడ్డి, అధ్యక్షులుగా శివరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా రాజేష్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా మహేష్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకుందాం

ప్రజాశక్తి-కొత్తచెరువు

గ్రంథాలయ ఉద్యమకారులను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి వెంకటరమణ, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కిష్టప్ప తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు వెంకట రమణయ్య, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉద్యమకారులు గ్రంథాలయాల స్థాపన, వాటి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. వారి వ్యక్తిగత ఆస్తులను సైతం గ్రంథాలయాలకు దానం చేశారని, అలాంటి మహనీయుల త్యాగాలు మరువలేనివ న్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు, పాఠకులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో పాఠకులు వేణుగోపాల్, మస్తాన్, మహబూబ్‌బాషా, వలి, పాల్గొన్నారు.

లేపాక్షి : శాఖా గ్రంథాలయంలో గ్రాంథాలయ అధికారి ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులు, స్వాతంత్ర్య సమరయోధుల గాథలు, ప్రముఖుల ప్రసంగాలు ఏర్పాటుచేశారు. సర్పంచి ఆదినారాయణ గ్రంథాలయ ఉద్యమకారులైన రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, తదితర ప్రముఖుల గురించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన పుస్తకాలను ఇచ్చి చదివించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, మారుతి, విజయ్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులైన ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు చేసిన సేవలను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో టీచర్ షెక్షావలి, లైబ్రేరియన్ నాగరాజు, విద్యార్థులు, పాఠకులు పాఠకులు పాల్గొన్నారు

లేపాక్షిలో ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాల వేస్తున్న గ్రంథాలయ అధికారి, తదితరులు

జానపద సంగీత కార్యక్రమాలు

ప్రజాశక్తి-గుడిబండ

కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శనివారం మండలంలోని పిసి.గిరి గ్రామంలో ఉన్న ఆశ్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ సహకారంతో జానపద సంగీత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అందులో భజన, కోలాటం, పౌరాణిక డ్రామా, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమం పీఠాధిపతులు దేవరప్ప, సంగీత కళాకారులు నాగరాజు, మరిస్వామి, ఆశ్రమం ప్రతినిధులు రాజప్ప, చిక్కన్న, హంపేగౌడ్, హనుమంతప్ప, గంగమ్మ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి పూజాసామగ్రి వితరణ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయానికి శనివారం నిజాం పూజా సామగ్రి, అయ్యప్ప భక్తులకు ఒక రోజు భిక్షకు అయ్యే ఖర్చును అందజేశాడు. నిజాం మాట్లాడుతూ ఏటా నవంబర్ 16వ తేదీ నుంచి 41 రోజుల పాటు ఆలయానికి పూజా సామగ్రి అందించే అవకాశం కలిగించడం పట్ల ఆలయ నిర్మాణ సంకల్పకులు పంచ్చార్ల ఆంజనేయనాయుడు, అయ్యప్ప భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనంతాచారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, పిట్టా ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-రొద్దం

రొద్దం సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. మండలంలోని రొద్దం, గౌరాజుపల్లి, ఎం.కొత్తపల్లి, నారనాగేపల్లి, పెద్దగువ్వలపల్లి, దొడగట్ట, రెడ్డిపల్లి, చిన్నమంతూరు గ్రామాలకు సరఫరా అయ్యే ఫీడర్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి సాయంత్రం 11 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు.

అపార్ అప్‌డేషన్‌పై ఎంపిడిఒ ఆరా

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపిడిఒ విజయ్‌భాస్కర్ సందర్శించారు. ఆయన బయోమెట్రిక్ హాజరు, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, స్కూల్ టాయిలెట్లను పరిశీలించి సమీక్ష చేశారు. అనంతరం స్థానిక జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థుల అపార్ అప్‌డేషన్ వేగవంతంగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మండల రీసోర్స్ సెంటర్‌ను సందర్శించి ఎంఇఒలు, సీఆర్పీలతో సమీక్ష నిర్వహించారు. అపార్ అప్‌డేషన్‌కు సంబంధించి హెచ్ఎంలతో వేగవంతంగా పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఎంపిడిఒ వెంట ఎంఇఒ రమణప్ప, సిబ్బంది ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలి యని వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. 35-40 ఏళ్ల కలిగిన మతి స్థిమితం లేని వ్యక్తి అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు జాతీయ రహదారిపై నడిచి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా పొలాలకు వెళ్లే రైతులు గమనించి సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా అతడు హైవేపై వెళ్తుండగా డ్యూటీలో ఉన్న పోలీసులు పలకరించగా తనది ఆదోని అని చెప్పినట్లు సమాచారం. మృతుని వివరాలు తెలిసిన వారు ఎస్ఐ-9440796833, సిఐ-9440796832 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కారు, బైక్ ఢీ.. యువకునికి గాయాలు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో సాయి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని కాగనిపల్లి గ్రామానికి చెందిన సాయి శనివారం ద్విచక్ర వాహనంపై గోరంట్లకు బయల్దేరాడు. కదిరి నుంచి బూదిలి వైపు వెళ్తున్న కారు అతడిని గొల్లపల్లి సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన సాయిని స్థానికులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-రొద్దం

పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో మండలంలోని ఆర్. మరవపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని చిన్నమంతూరు గ్రామానికి చెందిన వెంకటేశులు పని నిమిత్తం రొద్దంకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గమనించిన స్థానికులు రొద్దం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం పెనుకొండకు తరలించారు.

ఆర్టీసీ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీ ఉద్యోగులు సమయ పాలన పాటిస్తే ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో శనివారం ఆయన సమయ పాలన మాసోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికుల మన్ననలు పొందాలన్నా, సంస్థకు మరింత ఆదాయం రావాలన్నా డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. గ్యారేజ్ సిబ్బంది సకాలంలో బస్సులను పంపాలన్నారు. ప్రయాణికులతోనే ఆర్టీసీ మనుగడ ఆధారపడి ఉంటుందని, కావున వారికి మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిపిటిఒ మధుసూదన్

అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాదం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

దాతల సహకారంతో పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారులకు ఈ నెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకూ(60 రోజులు) అన్న ప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు అయ్యప్పస్వామి సేవా సమితి కమిటీ సభ్యులు సిఐ హేమంత్‌కుమార్, కృష్ణమోహన్‌నాయుడు, ప్రభాకర్ తెలిపారు. మొదటి రోజైన శనివారం మధ్యాహ్నం ఇటుకలపల్లి సిఐ జె.హేమంత్‌కుమార్ సహకాంతో 500 మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సేవా సమితి గౌరవాధ్యక్షుడు కృష్ణమోహన్‌నాయుడు మాట్లా డుతూ దాతల సహకారంతో 9 ఏళ్ల నుంచి అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాదం అందజేస్తున్నా మన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE, ANANTAPURAMU

A.S. No.36/2024

Between:
1. Jonna Narayana Swamy **(Died),**
2. Jonna Venkatalakshmi, 3. Jonna Chandra Kala,
4. Jonna Chandra Mohan ... Appellants

And

1. Joyas Krishnachar, 2. Cheviti Sreedhar Reddy
3. Kadiki Govinda .... Respondents

SUMMONS TO THE RESPONDENT NO.3

To : Kadiki Govinda, S/o. K.Manjunatha, Aged about 50 Years, Hindu, Trader, R/o. D.No.3-287, Somagutta Street, Kadiri Town, Now Sri Sathya Sai District. (R-3)

పైన తెలిపిన దావా లో మీ హాజరు నిమిత్తము కోర్టు వారు 21-11-2024 వ తేదీన వాయిదా వేసినారు. ఈ విషయము మీకు తెలియజేయుటకు పేపర్ పబ్లికేషన్ ద్వారా ఈ నోటీసు కోర్టు వారి ఉత్తర్వుల మేరకు జారీచేయడమైనది. **కావున 21-11-2024 వ తేదీన ఉదయం 10:20 గంటలకు పైన తెలిపిన కోర్టులో మీరు స్వతహాగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరయ్యి మీ అభ్యంతరములు తెలియపర్చుకోవలెను.**

లేనియెడల సదరు దావాను కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు : P. గురు ప్రసాద్, అడ్వకేట్, అనంతపురం.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE : ANANTAPURAMU

G.W.O.P.No.67/2024

(In the matter of appointment of guardian to the person and property of minor child, K.Surya @ Suri, aged about 16 Years and Permission to sell the petition schedule property - Regarding)

Between:
K.Kristappa ...Petitioner

And

Nil ...Respondents

GENERAL NOTICE

It is to inform the General public that the above named petitioner filed G.W.O.P.No.67/2024 on the file of the Hon'ble Prl. District Judge, Anantapuramu in the matter of appointment of guardian to the person and property of minor child K.Surya @ Suri, Aged about 16 Yrs, and for permission to sell the schedule mentioned property for the benefit of the minor. If any body is having objection, You can approach the Hon'ble court on **25-11-2024** and submit your objections before the Hon'ble court, The date of hearing is **25-11-2024 at 10.30 A.M.**

SCHEDULE

Property Situated within the Erst while Anantapuramu District, Now Sri Sathya Sai District in R.D of Hindupur, SRD of Hindupur Within the Parigi Mandal Situated in the Sirekolam Village Limits:

Babu	Sy.No.	Ac-Cs	Ac-Cs
Govt-Kushki	245-3	07-74 paiki	02-00
paiki		Ac-Cs Hectares	
		01-00 0.405	

Boundaries :
East : Land in the same Sy-No. Sold to R.lakshminarasappa. **West:** land belongs to Y.Hanumantha Reddy **North:** Land belongs to R.Lakshminarasappa and Others **South :** Land belongs to R.Naraseeyappa.

//By the Order of the Hon'ble Court//

M.NAGASYAM KIRAN
Advocate, Anantapuramu

S.M.PRASAD
Advocate, Hindupur.

ప్రలోభాలకు గురికావొద్దు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు, యువత ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకుని ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని హిందూపురం డీఎస్పీ మహేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా డీఎస్పీ మహేష్, వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో జీవితాన్ని ఉల్లాసంగా గడుపుతూనే తల్లిదండ్రుల, గురువుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. కేవలం చదువు వల్లనే మహిళలు అనేక రంగాలలో రాణించవచ్చన్నారు. అలాగే సైబర్ నేరాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం డీఎస్పీని,వన్ టౌన్ సిఐను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించి, సమాజంలో పత్రికల పాత్ర, వాక్ స్వాతంత్ర ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం విశ్వవిద్యాలయ పరీక్షల్లో బీఎస్సీలో మెరిట్ వచ్చిన విద్యార్థినులకు ఉర్దూ భాషా సమితి అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్, బికాంలో మెరిట్ వచ్చిన విద్యార్థినులకు జీఎస్టీ అధికారి గిరిధర్, బీఏలో మెరిట్ వచ్చిన విద్యార్థినులకు కళాశాల చరిత్ర అధ్యాపకులు, ఆకడమిక్ కోఆర్డినేటర్ శ్రీధర్ బంగారు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డిఎస్‌పిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపకులు

పశువైద్యశాలకు కేటాయించిన పాఠశాల గది

పాఠశాలలో పశువైద్యశాల.. వరండాలో తరగతులు..

ఇబ్బందుల్లో విద్యార్థులు

ప్రజాశక్తి-తలుపుల

మండల కేంద్రమైన తలుపులలో పశు వైద్య శాఖకు సొంత భవనం ఉండేది. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో స్థానిక ఉర్దూ స్కూల్ ఆధీనంలో ఉన్న ఓ పాఠశాల గదిని కరోనా సమయంలో అప్పట్లో పనిచేస్తున్న ఓ అధికారి తాత్కాలికంగా పశు వైద్య శాఖకు అప్పగించినట్లు సమాచారం. దీంతో పశువైద్య శాఖ వారు ఆ గదిలో కార్యాలయం ఏర్పాటు చేసుకొని ఆవరణలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంపియుపి ఉర్దూ స్కూల్‌లో నలుగురు ఉపాధ్యాయులు ఉండగా ముగ్గురు విద్యార్థులకు పాఠశాల గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. మరో ఉపాధ్యాయుడు వరండా లో పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. దీనికి తోడు విరామ సమయంలో పిల్లలకు ఆడుకోవడానికి మైదానం లేకుండా పోయింది. పక్కనే ఉన్న పశువైద్యశాల ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఉన్న గదిని పశువైద్య శాఖకు ఇచ్చి పిల్లలను ఆరుబయట కూర్చోపెట్టి తరగతులు నిర్వహించడం ఏంటని చర్చించుకుంటున్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి పశువైద్యశాల నిర్వహిస్తున్న గదిని పాఠశాలకు అప్పజెప్పాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎంపిడిఒ సరస్వతి

19 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలో ఈ నెల 19వ తేదీ నుండి ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరస్వతి తెలిపారు. గతంలో ఆధార్ వివరాలను ఆధునీకరించని ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 19, 26వ తేదీల్లో చలివెందల, 20, 27వ తేదీల్లో మలుగూరు, 21, 28వ తేదీల్లో కగ్గల్లు, 22, 29వ తేదీల్లో బాలంపల్లి, 19 26వ తేదీల్లో కొలిపి గ్రామాల పరిధిలో ఆధార్ నవీకరణ జరుగుతుందన్నారు. అదేవిధంగా 20, 27వ తేదీల్లో పూలకుంట, 21, 28వ తేదీల్లో కిరికెర-1, కిరికెర-3, 22, 29వ తేదీల్లో కిరికెర-2, 1926వ తేదీల్లో చౌళూరు-1, 20, 27వ తేదీల్లో తూమకుంట, 21, 28వ తేదీల్లో సంతేబిదనూరు, 22, 29వ తేదీల్లో చౌళూరు-2 గ్రామాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

విద్యార్థులకు 'అపార్' కీలకం

జిల్లా డిఐఇఒ రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి అపార్ సంఖ్య ఎంతో కీలకమైందని శ్రీ సత్యసాయి జిల్లా డిఐఇఒ రఘునాథ్ రెడ్డి తెలిపారు. శనివారం అపార్ పై పట్టణంలోని సప్తగిరి కళాశాలలో వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రతి ఒక్క విద్యార్థికి ఒక ప్రత్యేక అపార్ సంఖ్యను కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సంఖ్య ద్వారా ఒక విద్యార్థి తన జీవిత కాలంలో నిర్వహించే అకాడమిక్ కార్యక్రమాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. ఆ విద్యార్థి తన జీవిత కాలంలో పూర్తి చేసిన ప్రతి ఒక్క కోర్స్ మార్కుల జాబితాలు, సర్టిఫికెట్లు ఈ డిజిటల్ అకౌంట్లోనే నిక్షిప్తం చేయబడతాయన్నారు. తద్వారా ఈ డిజిటల్ అకౌంట్లోనే సర్టిఫికెట్లు తీసుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యనందిస్తున్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్ మెంట్ ప్రిన్సిపాళ్ల తమ కళాశాలలోని ప్రతి ఒక్క విద్యార్థికి అపార్ సంఖ్యను తెరిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో పాటు సప్తగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, పరిపాలనాధికారి గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా డీఐఈఓ రఘునాథ్ రెడ్డి

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం పరిగి మండల పరిధిలోని కొడిగెనహళ్లి అంధుల ఆశ్రమ పాఠశాలలో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణులు శివకు మార్ స్వామి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ సాధారణంగా వికలాంగులకు సకలాంగుల కంటే తెలివితేటలు అధికంగా ఉంటాయన్నారు. చూపు లేకపోయినా చూపు ఉన్న వారి కంటే జ్ఞానం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వైద్యులు పరీక్షించి ఇచ్చిన నివేదికను కలెక్టర్, హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా త్వరలోనే చెవి, ముక్కు, గొంతు కు సంబంధించి కూడా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ విద్యార్థులకు బూస్ట్, పేస్టు, సబ్బులు, బిస్కెట్లు అందించగా సీనియర్ న్యాయవాది సుదర్శన్ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేశ్వరి, వెంకటేశ్వరరావు ఎఎస్ఐలు శ్రీనివాసులు, బాలాజీ, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కుల వృత్తుల అభివృద్ధి ప్రణాళిక విధి విధానాలపై సమీక్ష

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం నగరంలోని ఉమ్మడి జిల్లాల వెనుకబడిన తరగతుల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అధ్యక్ష తన శనివారం కులవృత్తుల అభివృద్ధి ప్రణాళిక, విధివిధానాలపై బిసి కులాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆ సమీక్షకు టిడిపి కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మదనాపు పోతలయ్య కుమ్మర సంఘం తరపున హాజరయ్యారు. పోతలయ్య మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కుమ్మర శాలివాహనులు దాదాపు 50 వేల కుటుంబాలు, లక్ష ఇరవై వేల జనాభా కలిగి ఉన్నట్లు తెలిపారు. కుండలు తయారు చేసే వృత్తిదారులకు విద్యుత్ సారె, మట్టి కలపడానికి యంత్రం, మట్టి, కట్టెలు తదితర సామగ్రి తెచ్చుకునేందుకు మినీ ట్రాక్టర్, ముడిసరుకు కొనుగోలు, తదితర వాటి కోసం రాయితీపై రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం స్టేషన్ పరిధిలో హిందూపురం నుండి నింకంపల్లి వెళ్ళ రహదారిలో నిర్వహించిన తనిఖీల్లో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. పట్టణంలోని మోడల్ కాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి ఏడు బాక్స్ ల్లో హైవార్డ్స్ విస్కీ కర్ణాటక రాష్ట్ర మద్యం 672 టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహా, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సురేష్,సుధాకరరెడ్డి, శివ కుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

14న జాతీయ మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి-హిందూపురం

కేసుల పరిష్కారానికి పోలీసులు, న్యాయ వాదులు సహకరించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ కోరారు. డిసెంబర్ 14వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ పై సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ తో కలిసి శనివారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సాధ్యమైన మేర ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు అటు పోలీసులు ఇటు న్యాయవాదులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప, న్యాయవాదులు సుదర్శన్, నవీరా, భాగ్య, సీఐ జనార్దన్ లతోపాటు హిందూపురం వన్ టౌన్, టూ టౌన్, రూరల్, అప్ గ్రేడ్, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు, న్యాయవాదులతో సమీక్షిస్తున్న ఏడీజే శైలజ

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఇందిర

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్యానల్ న్యాయవాదులు కళావతి, నవీరా రెహ్మాన్, సంతోషికుమారిలు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆటోనగర్ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల విద్యాలయాల న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఇందిర అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తెలుసుకున్న అంశాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తెలియజేసి చైతన్యవంతులను చేయాలన్నారు. అలా ఎవరైనా గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు చేస్తుంటే స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మ, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఇందిర